# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

## పినిశెట్టి

### (విజయచిత్ర – 1969, జూన్ సంచిక నుంచీ)




సినిమా పరిశ్రమలో కేవలం స్వశక్తి మీదనే ఆధారపడి బాగా ప్రముఖులుగా నిలబడ గలిగిన వ్యక్తులు అరుదుగా కనిపిస్తారు. ప్రఖ్యాత రచయిత పినిశెట్టి శ్రీరామమూర్తి అలాంటి అరుదైన వ్యక్తి. చదువు సంధ్యలు లేకుండా చక్కని రచయితగా నిలబడగలగడం, రంగస్థలం మీద పెద్ద కృషి చెయ్యకుండానే నటుడిగా రాణించగలగడం, చిన్నతనంలో ఏ కథా చదవకుండానే అద్భుతమైన కథా రచయితగా రూపొందగలగడం అన్న విషయాలు మామూలు విషయాలు కావు. కేవలం – కృషి చేసీ, పట్టుదల పట్టీ, కష్టపడీ, ఆయన రచయితగా నిలబడ్డారు. ఇతర భాషా రచయితల రచనలను ఏ మాత్రం చదవలేని పినిశెట్టి రచనలను, ఇవాళ ఇతర భాషా రచయితలే అనుసరిస్తున్నారంటే అందులో ఘనమైన ఘనత వున్నది. కృషి, ఓరిమి, పట్టుదల, శ్రద్ద, ధ్యేయం మనిషికి ఎంత అవసరమో పినిశెట్టి జీవితం చెబుతుంది.

1920 వ సంవత్సరంలో నరసాపురంలో శ్రీరామమూర్తి పుట్టినప్పుడు, జాతక రీత్యా అతను 'గొప్పవాడు' అయ్యే సూచనలు వున్నా – ఎలా అవుతాడో మాత్రం ఎవరికీ అర్థం కాలేదు! ఎంచేతంటే, అక్షరాభ్యాసం అయిన మర్నాటి నుంచీ, అతను అక్షరాలు దిద్దటానికి పలకా, బలపం ముట్టుకునేవాడు కాదు. చదువుకోమని పెద్దలు ఎంత చెప్పినా అతను పెడ చెవిని పెట్టి, ఆటల మీద శ్రద్ధ చూపించేవాడు. అయితే శ్రీరామమూర్తి బడిలో ఎలా వున్నాడో వాళ్ళకేం తెలుసు ?– ఇంటి దగ్గర పలక మీద అక్షరం రాయకపోయినా, బడిలో మాత్రం శ్రద్ధగా బుద్ధిగా పాఠాలు వప్పజెప్పేసే వాడు. అతనికి 'ఏకసంతగ్రాహ్యం' వున్నదని బడిలో ఉపాధ్యాయులు

అభిప్రాయపడేవారు. ఆశక్తితో అతను మళ్ళీ చదవాల్సిన అవసరమే లేకపోయేది. అతన్ని ఈనాడు ఇంతటి రచయితగా నిలబెట్టడానికి ఆశక్తి కూడా చాలా మట్టుకు దోహదం చేసి వుండాలి !

తనకు రెండో ఏడు నడుస్తూ వుండగానే, శ్రీరామమూర్తి తల్లిని పోగొట్టుకున్నాడు. తండ్రి గారు రెండో పెళ్ళి చేసుకున్నారు. శ్రీరామమూర్తి బాల్యం అంతా సవతి తల్లి దగ్గరే గడిచింది. తండ్రి గారు దైవభక్తుడు. ఉన్న కాస్త ఆస్తినీ అమ్మేసి, పైగా అప్పులు కూడా చేసి ఆయన దేవాలయం కట్టించాడు! ఆ మనిషి దేవుడికి ఆలయం కట్టించాడు కాని, ఆ దేవుడు మాత్రం ఆ మనిషికి 'ఉనికి' లేకుండా చేశాడు! విధిని తలచుకుంటూ ఆ కుటుంబం వీధిన పడిపోయింది ! ఆర్ధిక బాధల వల్ల ఆ కుటుంబం అయిదారు వూళ్ళు తిరిగింది – అప్పటికి శ్రీరామమూర్తికి ఎనిమిదో ఏడు ! అంతవరకూ అతనికి సరిగా చదువే లేదు. పూట గడవటానికి తండ్రిగారు పడే అవస్థల్లో – ఆయన ఈ కొడుకు చదువు విషయం ఏం పట్టించుకుంటాడు ? అయినా, శ్రీరామమూర్తి క్లాసులో ఫస్టుగానే వచ్చేవాడు.

పీచుపాలెం బడిలో ఒకనాడు పినిశెట్టి చదువుకోడానికి వెళ్ళాడు.

"ఏ క్లాసులో జేరతావు?" అన్నారు మాస్టర్లు.

"ఒకటి" అన్నాడు పినిశెట్టి.

పరీక్ష జరిపితే అతను మూడో క్లాసు చదువుకు సరిగ్గా వున్నాడు. దాంతో మూడో క్లాసులో వేశారు అతన్ని.

"మీవాడు బాగా చదువుతాడు. పైచదువులు బాగా చదివించండి. గొప్పవాడు అవుతాడు." అని ఆ మాస్టర్లు పినిశెట్టి తండ్రిగారితో అంటే – ఆయన నిస్పృహతో ఓ చిరినవ్వు నవ్వి వూరుకునేవారు.

ఐదో తరగతిలో పినిశెట్టికి – నారాయణ స్వామి జమీందారుగారి అబ్బాయి నీలకంఠంతో మైత్రి ఏర్పడింది. 'అమ్మ' అంటే ఏమిటో తెలియని శ్రీరామమూర్తి తన ఐదవ ఏటనే బుల్లిబుల్లి భావాలతో 'అమ్మ' అని ఒక కథ రాశాడు. ఆ కథ చదివినవాళ్ళు ఆశ్చర్యపోయారు. జమీందారుగారు అబ్బురపడి, ఆశీర్వదించారు.

అలా అలా, అతని చదువు రెండో ఫారం వరకూ వచ్చి అక్కడ ఆగిపోయింది. అప్పటికి తండ్రి గారు రిటైరు అయినారు. కుటుంబం పరిగింది. ఆర్ధిక ఇబ్బందలూ పెరిగాయి. చదువుకు స్వస్తి చెప్పి, తనూ ఉద్యోగం చేసి అంతో ఇంతో సంపాయించాల్సిన బాధ్యత శ్రీరామమూర్తి నెత్తిన పడింది. దాంతో అతను కష్టపడి పని చెయ్యడం మొదలెట్టాడు. ఒక వృత్తి అని లేదు; ఒక పని అనీ లేదు. తను చెయ్యగలిగే పనల్లా చేశాడు. అప్పుడే అతనికీ జీవితం అర్ధమైంది. జీవితంలో వుండే మజాకన్న బాధ అర్ధమైంది. ఆ జీవితానుభవాలే అతనికి పాఠాలయినై, చదువులయినై; తర్వాత తర్వాత రచనలయినై, ఈనాడు ఆయన రానే సినిమా కథలలోని కరుణరసఘట్టాలకు అప్పుడే పునాదులు పడ్డాయి. కొంతకాలం పొలంపని, కొంత కాలం కుట్టుపని, మరి కొంత కాలం గుమాస్తాపని – ఇలా రకరకాల పన్లు చేశాడు అతను. తీరిక వేళల్లో అతని దృష్టి సాహిత్యం మీదకు మళ్ళుతూ, చక్కని గ్రంధాలు చదవడానికి ప్రోత్సాహించింది. పుస్తకాలూ, పురాణాలూ, గ్రంధాలూ, ప్రబంధాలూ చవడం సాగించాడు – వాటికి అర్ధాలు తెలిసినా తెలియకపోయినా.

జమీందారుగారింట్లోనే గుమాస్తా వుద్యోగంలో వుండగా – జమీందారుగారు ఆ ఉద్యోగం అతనికి తగదని మానిపించేసి – పుస్తకాలు రాయమని ప్రోత్సాహించారు. వాళ్ళబ్బాయి నీలకంఠం మరీనూ.

పినిశెట్టి సంస్కృతం నేర్చుకుందామని ప్రయత్నం చేశాడు గాని – కుదరలేదు. స్వశక్తితోనే, స్వయంగానే అతను చదువు నేర్చికోవడం ఆరంభించాడు ! పాటలూ, పద్యాలూ, కథలూ, రాయడం ఆరంభించాడు. ఆ ఉత్సాహం అలా వునా దానికితగ్గ ప్రోత్సాహం – పొట్టనిండితే మరింతగా కనిపించేది. పదహారో ఏటనే అతనికి తండ్రిగారు వివాహం చేశారు. ఆర్ధికమైన ఇబ్బందులు తండ్రిగారినీ, శ్రీరామమూర్తినీ తలకిందులు చేశాయి. తండ్రి గారు మంచాన వుండి – అలాగే కన్నుమూశాడు.

శ్రీరామమూర్తికి కన్ను తెలియలేదు; దిక్కుతోచలేదు. నిరాశాలూ నిస్పృహలూ ఆవరించాయి. జీవితం మీద విరక్తి కలిగింది. జీవితం అంటే కష్టమూ సుఖమూ కలగాలి గాని, కేవలం కష్టాలే అయితే అది జీవితం ఎలా అనిపించుకుంటుంది? అనుకున్నాడు. ఎవరికీ చెప్పకుండా, ఒక ఆశ్రమం చేరుకుని, తనకు మంత్రోపదేశం చేసి, సంసార విముక్తుడిని చెయ్యమన్నాడు. "నీకు మంచి భవిష్యత్తు వుంది. సన్యసించడానికి నీకు హక్కు లేదు" వెళ్ళమన్నారు ఆ ఆశ్రమవాసి. ఆ భవిష్యత్తు ఏమిటో, ఎక్కడుందో పినిశెట్టికి అర్ధం కాలేదు. అతను ఇంటికి తిరిగొచ్చాడు.

అలా వుంటూనే అతను, 'ప్రతిమ' అనే నాటకంలో రైతు పాత్ర ధరించాడు; 'భారతి' పత్రికలో 'నిష్కృతి' అనే కథానికి రాశాడు. ఆ రెండు అనుభవాలనూ పురస్కరించుకుని అతను నాటకం రాయాలనుకున్నాడు.

పాలకొల్లులోని శ్రీ రామ్ మోహన్ రాయ్ క్లబ్ గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్న లక్ష్మీపతిగారు – పినిశెట్టి కథ చదివి, ముచ్చటపడి, అతనికి 'లైబ్రేరియన్' ఉద్యోగం ఇచ్చారు. ఆ లైబ్రరీలో చేరి అతను చాలా చదువుకున్నాడు; జీర్ణం చేసుకున్నాడు, ఉత్సాహం పెల్లుబికింది; ప్రోత్సాహం కనిపిస్తున్నది; అప్పుడే అతను 'ఆదర్శజ్యోతి' అనే నాటకాన్ని రాసి, ఆదర్శ నాట్యమండలిని స్థాపించాడు. 1946 లో జరిగిన ఆంధ్ర నాటక కళాపరిషత్తులో ఆదర్శనాట్యమండలివారు ప్రదర్శించిన 'ఆదర్శజ్యోతి' నాటకానికి యోగ్యతాపత్రం లభించింది.

ఒక మిత్రుడు బొంబాయిలో తెలుగు సినిమా మొదలెడుతున్నాననీ, దానికి సంభాషణలు రాయమనీ పినిశెట్టిని పిలిపించాడు. కొన్ని నెలలు ఆయన అక్కడ వున్నాడే గాని, ఆ చిత్రనిర్మాణ సూచనలేమీ కనిపించలేదు. తిరిగి ఆయన పాలకొల్లు వచ్చి, ఆదర్శనాట్యమండలిని పటిష్టం చేస్తూ, కొన్ని నాటకాలు రాశారు. అప్పుడే 'కులంలేని పిల్ల', 'పల్లెపడుచు', 'అన్నాచెల్లెలు' నాటకాలు వెలువడ్డాయి. ఆదర్శనాట్యమండలి వారు ఈ నాటకాలను ప్రదర్శించారు. నాటకాలకూ, పినిశెట్టికీ, మంచి పేరు ప్రఖ్యాతులు లభించాయి. అనేక చోట్ల ఆ నాటక ప్రదర్శనలు జరిగాయి. ప్రేక్షకులు విరగబడ్డారు. ఆయన నాటకాలను మంచి గిరాకీ కలిగింది. ఆదర్శనాట్యమండలి అనేకమంది నటీనటులను తయారుచేసింది. చలం, చంద్రు సూర్యనారాయణ, హేమలత, నిర్మల, తిలకం, మొదలైన వారు ఆదర్శనాట్యమండలి నుంచి వచ్చినవారే.

ఆంధ్ర నాటక కళాపరిషత్తులో 'పల్లెపడుచు' నాటకానికి మొదటి బహుమతి లభించింది. ఆ ప్రదర్శనను చూసిన వాళ్ళందరూ పినిశెట్టిని బాగా అభినందించారు. ఆనాడు ప్రత్యేకంగా వచ్చిన ప్రముఖ హిందీ నటుడు పృథ్వీరాజ్ కపూర్ మరీనూ. ఆయన పినిశెట్టిని కావలించుకుని, చాలా గొప్పగా అభినందించారు. ఆ నాటకంలో ముఖ్యమైన పాత్ర ధరించిన పినిశెట్టికి నటుడిగా కూడా ఖ్యాతి లభించింది. అప్పుడే పృథ్వీరాజ్, బాల నటుడు చలాన్ని (నేటి హాస్యనటుడు చలం) చూసి – 'అరె దిలీప్ కుమార్ లా వున్నాడే' అని, 'ఆంధ్రా దిలీప్' అన్నారు. అతనికి ఆ పేరు అప్పుడు అలా వచ్చింది.

నల్లరామ్మూర్తి అడపా దడపా పినిశెట్టి నాటకాల రిహార్సల్సుకు వెళ్తూవుండేవాడు. ఒకనాడు అతను – "గురూజీ, మీరు సినిమాలకు రాయాలి" అని పట్టుబట్టాడు. అది ఎలాగో శ్రీరామమూర్తికి అర్థం కాలేదు. "నేను చెబుతాగా. బి.ఏ. సుబ్బారావుగారితో మాట్లాడి, మీకు చెబుతాను." అన్నాడు నల్లరామ్మూర్తి.

నల్లరామ్మూర్తి అన్నట్టే జరిగింది. 1951 లో బి.ఏ. సుబ్బారావుగారు పినిశెట్టిని పిలిపించారు. 'పల్లె పడుచు' ను చిత్రంగా తియ్యాలని సుబ్బారావుగారు భావించారు. కాని, ఎందుకనో అది తొందరగా కుదరలేదు. పినిశెట్టి మద్రాసులో వున్నారు. రోజులు, నెలలూ గడిచిపోతున్నాయి.

పినిశెట్టి లేకపోవడంతో అక్కడ, ఆదర్శనాట్యమండలికి అంతరాయం కలిగింది. నాటకాలకు గిరాకీ కలుగుతోంది. కాని, శ్రీరామమూర్తి లేకపోవడంతో అవన్నీ జారవిడుచుకోవలసి వస్తున్నది. చలం వాళ్ళూ వుత్తరాలు రాయడం సాగించారు. "మీరు వెళ్ళి అక్కడ కూచున్నారు. ఇక్కడేమో మా పరిస్థితులు ఇలా వున్నాయి. నాటకాలు పోతున్నాయి. వీలైతే, మద్రాసులో మన నాటక ప్రదర్శనం ఏర్పాటు చెయ్యండి. దాని ద్వారా మాకు కూడా ఏదైనా లాభం వుండొచ్చు" అని.

సరేనని, పినిశెట్టి ఆర్. ఆర్. సభలో నాటకం ఏర్పాటు చేశారు. సినిమా ప్రముఖుల కందరికీ ఆహ్వానాలు పంపారు.

నాటక ప్రదర్శనం చూడడానికి ప్రముఖులందరూ వచ్చారు. కీ.శే. హెచ్. యం. రెడ్డి గారు ఆ ప్రదర్శనకు అధ్యక్షులు. నాటకం బాగా జరిగింది. ప్రేక్షకులందరూ బాగా మెచ్చుకున్నారు. స్వర్గీయ డా॥ గోవిందరాజుల సుబ్బారావుగారు ఆఖరి దృశ్యం ముందు స్టేజీలోకి వెళ్ళి పినిశెట్టిని కావలించుకుని, గొప్ప నటుడనీ, గొప్ప రచయితనీ అభినందించారు. తెలుగుదనం, తెలుగు వాతావరణం నాటకంలో కనిపించిందని శ్లాఘించారు. అంతా అయిన తర్వాత – "నాయినా ! కలక్షనెంత వచ్చింది?" అన్నారు.

"కలక్షన్ ఎలా వస్తుందండీ – అందరూ ఆహ్వానితులేగా. తొంభై రూపాయలు మాత్రం వచ్చింది"

"ఖర్చు?"

"పదమూడు వందలు"

ఆ మాట వినగానే సుబ్బారావుగారిలో ఆవేశం హెచ్చింది. నాటకం పూర్తి అవగానే ఆయన రంగస్థలం మీదకు ఉరికి – "మనలను ఇంతగా రంజింపజేసిన ఈ నాటక సమితిని గౌరవించవలసిన భాధ్యత మనకు లేదా?" అని గట్టిగా అడిగారు. దాంతో పెద్దలందరూ నూటపదహార్లు చదివించడం ఆరంభించారు. కాస్సేపయిన తర్వాత, పినిశెట్టి రంగస్థలం మీదికొచ్చి చదివింపులు ఆపుజేయవలసిందని కోరుతూ, తమ ఖర్చులకు మించిన డబ్బు చేరిందని కృతజ్ఞతలు తెలుయజేశారు!

ఆ ప్రదర్శన పినిశెట్టిని రచయితగానూ, చలాన్ని నటునిగానూ నిలబెట్టింది ! హెచ్. యం. రెడ్డిగారు పినిశెట్టిని నటుడిగా తన సంస్థలో పని చెయ్యమని, నెలజీతం ఇస్తాననీ చెప్పారు. కాని, పినిశెట్టికి, రచయితగా రావాలని వున్నది. అంచేత అతను అంత ఉత్సాహం చూపించలేదు.

పద్మరాజుతో కలిసి, రచయితగా పనిచెయ్యమని తన వాహిని సంస్థలో బి. యన్. రెడ్డి అవకాశం ఇచ్చారు. చిత్ర రచన, కథ, మంచి చెడ్డలు – మొదలైన విషయాలన్నీ పినిశెట్టి బి.యన్. దగ్గర తెలుసుకున్నారు.

రచయితగా పినిశెట్టిని మొదటిసారిగా పరిచయం చేసి, వెలుగులోకి తీసుకొచ్చినది – బి. ఏ. సుబ్బారావు. బి.యన్. దగ్గర వుంటూ వుండగానే – సంతానం, పరివర్తన చిత్రాలకు రచన చేసే అవకాశం వచ్చింది పినిశెట్టికి. అవి చేస్తూవుండగా బి. ఏ. సుబ్బారావుగారి 'రాజూ పేదా' వచ్చింది. అయితే ముందుగా విడుదలయిన చిత్రం 'రాజూ పేదా'. ఆయన రాసిన 'అన్నా చెల్లెలు' నాటకం ఆధారంగా 'పరివర్తన' చిత్రానికి కథ కూడా రాశారు. తాతినేని ప్రకాశరావు ఈ చిత్రానికి దర్శకుడు. 'సంతానం' చిత్రంతో దర్శకుడు ప్రసాద్ గారితో పరిచయం కలిగింది. ఆ పరిచయమే ప్రసాద్ గారు తీసిన 'ఇలవేలుపు' చిత్రానికి పినిశెట్టి రచయిత కావడానికి కారణమైంది.

"అటువంటి ప్రముఖులతో పని చేసే భాగ్యం కలగడం వల్ల నాకు మొదట్లోనే సినిమా పద్ధతులు అలవడ్డాయి. ఎన్నో విషయాలు వారు నాకు నేర్పారు." అంటారు శ్రీరామమూర్తి కృతజ్ఞతాభావంతో.

ఆంధ్ర పత్రికలో 'దత్తత' అనే సీరియల్ నవల రాయడం ద్వారా పినిశెట్టి శ్రీరామమూర్తి పేరు అందరికీ ఇంకా బాగా తెలిసి, చక్కని కథా రచయితగా కూడా అతనికి మంచి స్థానం వచ్చింది.

అనుపమావారి 'అత్తా ఒక ఇంటి కోడలే' 'ఈడూ జోడూ' మొదలైన చిత్రాలకు కథలూ సంభాషణలూ రాశారు. ఇంతవరకూ ఆయన 30 చిత్రాలకు రచనలు చేశారు. అందులో పది చిత్రాలు తన సొంత కథలు గలవి.

విశేషమైన అనుభవాన్ని పుంజుకున్న తర్వాత, పినిశెట్టి 'రవుతూ పిక్చర్స్' అనే సంస్థను స్థాపించి – 'నిత్య కల్యాణం – పచ్చతోరణం' చిత్రాన్ని తీశారు. ఈ చిత్రానికి ఆయన దర్శకుడు, నిర్మాతా. అందులో చలాన్ని హీరోను చేశారు; రామకృష్ణను రెండో నాయకుడిగా పరిచయం చేశారు. 'నిత్య కల్యాణం పచ్చతోరణం' మంచి పేరు తెచ్చి పెట్టింది. ఆ కథకు మంచి బలం వున్నదనీ, సర్వమానవ సమైక్యతను ప్రబోధిస్తున్నదనీ అందరూ కొనియాడారు. దర్శకుడిగా కూడా పినిశెట్టికి మంచి పేరొచ్చింది. ఆ చిత్రాన్నే ప్రసాద్ గారు తమిళంలోనూ (తాయిల్లా పిళై) హిందీలోనూ (దాదిమా) తీశారు.

ఆ విధంగా పినిశెట్టి రాసిన చాలా కథలు ఉత్తరాదికి పరిచయమైనాయి. కథ సార్వజనీకంగా వుండడం, కథలో కరుణరసం ప్రధానంగా వుంటూ హృదయాలను హత్తుకొనడం వంటివే ఆయన కథలు ఇతర భాషలకు కూడా వెళ్ళడానికి కారణాలు.

'నిత్య కల్యాణం – పచ్చతోరణం' చిత్రానికి కేంద్రప్రభుత్వం ఇచ్చే బహుమతి వస్తుందని అందరూ ఆశించారు. వచ్చిందనే అనుకున్నారు. కాని, చిత్రాన్ని 'రీ ఎడిట్' చేసి, అవార్డ్స్ కమిటీకి చూపడం వల్ల – అది అనర్హమైంది. ఆ విధంగా నిరాశ కలగడంతో పినిశెట్టి మానసికంగా కృంగిపోయి, మంచం కూడా పట్టారు. దర్శకత్వం చెయ్యాలన్న వాంఛ తగ్గిపోయింది !

తర్వాత ఆయన కొన్ని చిత్రాలకు కథలూ, మాటలూ రాశారు. 'పంజరంలో పక్షులు' అనే నాటకం రాసి, అందులో తాను కూడా ఒక హాస్యపాత్ర ధరించడంతో –పినిశెట్టికి 'చిలకా గోరింకా' లో ఒక హాస్యపాత్ర లభించింది.

శ్రీ సారధి స్టూడియోస్ వారి 'ఆత్మీయులు' ప్రసాద్ ఆర్ట్ వారి 'సత్తెకాలపు సత్తెయ్య' నాగవళీ వారి 'జరిగిన కథ' చిత్రాలు త్వరలో విడుదల కానున్న, ఆయన సంభాషణలు రాసిన చిత్రాలు. ప్రస్తుతం, పినిశెట్టి శ్రీ రామమూర్తి రవీంద్ర, శ్రీకాంత్, రెడ్డి అండ్ కో, గిరిధర్ ప్రొడక్షన్స్, బాబూ పిక్చర్స్ సంస్థలు నిర్మిస్తున్న సాంఘిక చిత్రాలకు మాటలు రాస్తున్నారు.

"సొంత కథలను సినిమాలుగా తియ్యడానికి ఇప్పుడు నిర్మాతలు జంకుతున్నారు – కథ తమకు బాగున్నా, ప్రేక్షకులు ఎలా ఆదరిస్తారోనన్న భయంతో, అందుకనే 'అసలు' కథలు నేడు రావడం లేదు. ఒక భాషలో బాగా పోయిన చిత్ర కథను తీసుకోవడంలో గ్యారంటీ ముందుగానే కనిపిస్తున్నది. అందుకని – ఆ కథలను తీసుకునో, వాటి ఆధారంగానో మనకు చిత్రాలు వస్తున్నాయి. ఇప్పుడు సొంత కథలకు ఆర్థికంగా కూడా అంత లాభం లేకపోతున్నది. కథ తయారు చెయ్యడంలో వున్న శ్రమకు తగ్గ ఫలితం దక్కడం లేదు. అందుకని నేను, మాటలు మాత్రమే రాస్తున్నాను. అయినా నా దగ్గర మంచి కథలున్నాయి. ఆ కథలను పుస్తక రూపంలో ప్రచురించాలనుకుంటున్నాను. మన దేశంలో సొంత కథలు తయారు చేయగల శక్తివంతులు వున్నారు. కాని వారు తయారు చేసే కథలు సద్వినియోగం కావడం లేదు." అన్నారు పినిశెట్టి.

COMMENTS